క్లుప్తంగా

వైవీని కలిసిన హనిమి రెడ్డి


వైవీ సుబ్బారెడ్డితో హనిమి రెడ్డి

అద్దంకి: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజక వర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి ఆదివరం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన్ను కలిసిన వారిలో నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు మారం వెంకారెడ్డి, నాయకులు పుటరాజు సీతారామయ్య, సింగరకొండ పాలెం సర్పంచ్ ఎర్రిబోయిన తిరుపతయ్య ఉన్నారు.

అనాథాశ్రమానికి ఫ్రిజ్ బహూకరణ


మార్టూరులో ఆశ్రమ నిర్వాహకుడు చందుకు ఫ్రిజ్ అందిస్తున్న దాతలు

మార్టూరు: మండల కేంద్రం మార్టూరులో నిర్వహిస్తున్న అమ్మ అనాథాశ్రమ నిర్వాహణ కోసం దాతలు ఆదివారం 10 వేల రూపాయల విలువైన ఫ్రిజ్‌ను బహూకరించారు. బల్లికురవ మండలం కొణిదెన గ్రామానికి చెందిన గుంజి దానయ్య, కోటి రత్నమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు వెంకటేశ్వర్లు, ఆదిశేషు, ఏడుకొండలు, అంకారావు ఆశ్రమంలోని వృద్ధులు, అనాథల తాగునీటి సౌకర్యం కోసం ఫ్రిజ్‌ను ఆశ్రమ నిర్వాహకులు గుంటుపల్లి చందుకు అందించి వృద్ధులకు అన్నదానం నిర్వహించారు.

శానిటేషన్ వర్కర్‌కు తీవ్ర గాయాలు


కుప్పకూలిన శానిటేషన్ వర్కర్ అంజిబాబు

అద్దంకి: పంచాయతీ వర్కర్ అకస్మాత్తుగా కుప్పకూలడంతో తలకు తీవ్రగాయాలైన సంఘటన పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం వద్ద ఆదివారం జరిగింది. అందిన సమాచారం మేరకు మునిసిపాలిటీలోని శానిటేషన్ విభాగంలో పనిచేసే బి. అంజిబాబు ఉన్నట్టుండి ఒక్కసారిగా కుప్పకూలాడు. దీంతో తలకు తీవ్రగాయమై అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది వాహనంలో క్షతగాత్రుడిని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు.

విజ్ఞాన భాండాగారాలు గ్రంథాలయాలు


బహుమతులు అందిస్తున్న రాయుడు రవీంద్ర

చీరాల అర్బన్: విజ్ఞానాన్ని పెంపొందించేందుకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రాయుడు రవీంద్ర అన్నారు. స్థానిక గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం ప్రసంగించారు. 20 మంది విద్యార్థులకు సభ్యత్వం కట్టారు. అనంతరం వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పాఠశాల విద్యార్థులతో నీతి కథలు చెప్పించారు. గత పదిరోజుల నుంచి జరిగిన ఆటల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందించారు. పరుగుపందెం పోటీలను నిర్వహించారు. గ్రంథపాలకురాలు డి.ధనమ్మ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విజ్ఞాన శిబిరం


విజ్ఞాన శిబిరానికి హాజరైన విద్యార్థులు

సంతమాగులూరు (అద్దంకి రూరల్): సంతమాగులూరు లోని శాఖ గ్రంథాలయంలో లైబ్రేరియన్ బాదం భాస్కర్‌రెడ్డి ఆదివారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహించారు. శిబిరంలో 32 విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, స్పోకెన్ ఇంగ్లిషుతో పాటు కథలు చెప్పించారు. విజ్ఞాన శిబిరాన్ని విద్యార్థులు హాజరై విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని గ్రంథపాలకుడు కోరారు.

నలు దిక్కులా దుక్కులే!

- వేసవి దుక్కులతో భూమి సారవంతం
- రైతులు సిద్ధం కావాలంటున్న వ్యవసాయాధికారులు
- జిల్లాలో అనుకూల సమయం ఇదే..


అద్దంకి ప్రాంతంలో వేసవి దుక్కులు దున్నతున్న రైతు

అద్దంకి: వేసవిలో ఓ పక్క భగభగ మంటలు మండుతున్నా.. అది రైతులకు ముందస్తు మేలే చేస్తుంది. ఈ ఎండల్లో దుక్కులు దున్నడం వలన భూమి సారవంతం అవుతుంది. ముందు తరాల వారు ఈ పద్ధతిని కచ్చితంగా అవలంభించేవారు. ప్రస్తుతం అందరూ కాకున్నా ఎక్కువ మంది రైతులు భూమిని అలాగే ఖాళీగా వదిలేస్తున్నారు. దీనివల్ల భూములు నిస్సారమయ్యే ప్రమాదం ఉంది. అందుకే దుక్కులు దున్నడం ఓ ఆవశ్యకత అని వ్యవసాయాధికారులు తెలియజేస్తున్నారు.

పూర్వీకుల పద్ధతే మేలు..

మన పూర్వీకులు ఏ పని చేసినా అది దీర్ఘ కాలిక ప్రయోజనంతోనే ముడిపడి ఉండేది. కన్న బిడ్డల్లా భూములను నాడు కాపాడుకొనేవారు. జీవరసాయన ఎరువులు వాడి నేల పదును పెంచేవారు. వేసవి కాలంలో కచ్చితంగా దుక్కులు దున్ని భూమాతను కాపాడుకొనేవారు. అయితే కాలక్రమంలో అన్నదాత వేసవి దుక్కుల విషయాన్నే మరచిపోతున్నారు. సంవత్సరం పొడవునా ఖాళీ లేకుండా ఏదో ఒక పంట పండిస్తూ రసాయన ఎరువుల వాడి నేలను మరింత నిస్సారంగా చేస్తున్నారు. ఇది భవిష్యత్ తరాలకు చేటు తేక మానదు.

నేడు అనుకూల పరిస్థితి

జిల్లాలో అక్కడక్కడా వర్షం పడి ఎండిన భూములు గుల్లబారాయి. అద్దంకి, బాపట్ల, చీరాల, రేపల్లె, పర్చూరు, వేమూరు తదితర నియోజకవర్గాల్లోని గ్రామాల్లోని భూముల రైతులు వర్షాలు పడిన వెంటనే వేసవి దుక్కులు దున్నుతారు. ఎండవేడిమి సమయంలో దుక్కులు చేయడం ఎలాగని చాలామంది రైతులు అపోహ పడుతుంటారు. అలాంటి సందేహం అక్కరలేదు. వేసవిలో వర్షం పడగానే వేసవి దుక్కి చేయడంతో పాటు పశువుల ఎరువును వేయడం వలన భూములు సారవంతం అవుతాయని, తద్వారా వేసిన పంటల దిగుబడులు ఆశించన మేర వస్తాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ప్రయోజనాలు ఇవే..

వేసవిలో దుక్కులు దున్నడం వలన పొలంలో పెరిగిన గడ్డి మొక్కలు ఎండిపోయి భూమిలో కలిసి ఎరువుగా మారతాయి. భూమిలో ఉండే వివిధ రకాల పురుగులు పైకి రావడం వలన వాటిని పక్షులు తినివేస్తాయి కాబట్టి.. అనంతరం వేసిన పంటలకు పట్టకుండా రక్షణ కలుగుతుంది. దున్నకంతో హానికర పురుగులు బయటకు రావడం వలన ఎండకు చనిపోయి తదుపరి వేసే పంటలో వాటి ఉత్పత్తి తగ్గుతుంది. తెగుళ్లకు కారణమయ్యే శిలీంధ్రాలు కూడా ఎండలకు చనిపోయే అవకాశం ఉంటుంది. దుక్కి చేసిన పొలాల్లో పచ్చిరొట్ట విత్తనం విత్తుకోవడం వలన భూమిసారాన్ని మరింత పెంచుకోవచ్చు.

> **దుక్కులతో భూమికి సారం:**
> వేసవి దుక్కుల వలన భూములకు సారం లభిస్తుంది. దున్నిన తర్వాత పడిన వర్షం భూమిలో ఇంకుతుంది. తర్వాత వేసే పంట బెట్టకు రాకుండా ఉపయోగపడుతుంది. వివిధ రకాలైన గడ్డి జాతి మొక్కలు మొలక దశలోనే చనిపోతాయి. చెత్తాచెదారం అంతా ఎండిపోయి అనంతరం కురిసే వర్షానికి తడిసి ఎరువుగా మారుతుంది. దాంతో భూములకు సారం వస్తుంది.
> లావణ్య, ఏవో

మాంసాహారం.. విష వలయం


వైద్య పరీక్షలు చేయకుండానే బహిరంగంగానే మార్కెట్‌లో విక్రయిస్తున్న మటన్

- ఎటువంటి వైద్య పరీక్షలు చేయకుండానే మాంసం విక్రయాలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- అనారోగ్యం పాలవుతున్న వినియోగదారులు

చీరాల టౌన్: మాంసం విక్రయాలు అడ్డగోలుగా జరుగుతున్నాయి. రకరకాలు వ్యాధులు సోకిన జీవాలను మార్కెట్‌లో తెచ్చి మాంస విక్రయాలు జరుపుతుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. రోగాలతో చనిపోయిన వాటిని కోసి ఇష్టానుసారంగా విక్రయిస్తున్నారు. కనీస నిబంధనలు పాటించడంలేదు. ఇంత జరుగుతున్నా కానీ అధికారులు చర్యలు తీసుకోవడంలేదు. నిబంధనల ప్రకారం మాంసం విక్రయాలు జరపాలంటే ముందుగా కోసే జీవాలకు స్థానిక పశువైద్యాధికారిచే పరీక్షలు నిర్వహించాలి. అధికారులు మాత్రం చూసీ చూడనట్లు పోతున్నారు. మాంసం విక్రయదారుల నుంచి పన్నులు వసూళ్లు చేస్తున్నారే కానీ ప్రజారోగ్యం గురించి పట్టించుకోవడంలేదు. చీరాల నియోజకవర్గంలోని చీరాల, వేటపాలెం మండలాల్లో 24 గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలో 33 వార్డులు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో 10 నుంచి 20 వరకు మటన్ దుకాణాలున్నాయి. వీటిలో మాంసం తిని ప్రజలు అనారోగ్యపాలవుతున్నారు. రెస్టారెంట్లలో అయితే రోజుల తరబడి నిల్వ ఉన్న మాంసాలను వండి వడ్డిస్తున్నారు. ఆదివారం రోజున అయితే చెప్పే పనేలేదు.

> **జీవాలకు పరీక్షలు తప్పనిసరి:**
> ఒక జీవాన్ని కోసే ముందుకు అది అరోగ్యంతో ఉందా? అనారోగ్యంతో ఉందా? అని పరీక్షించాలి. కొన్ని జీవాల ద్వారా వైరస్‌లు మానవునికి సంక్రమిస్తాయి. అటువంటివి తినడం వలన అనారోగ్యం పాలవడం తప్పదు. కబేళాల నిర్వహణ సక్రమంగా చేస్తే ఇలాంటి ఇబ్బందులు ఉండవు.
> డాక్టర్ మద్దు హనుమంతరావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి, బాపట్ల

ఈర్లగంగమ్మకు ఘనంగా పూజలు


ప్రత్యేక అలంకరణలో ఈర్లగంగమ్మ


కారంచేడులో ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

బల్లికురవ: వైశాఖ మాసం, బహుళ పక్షం తదియ సందర్భంగా ఆదివారం మండలంలోని వాడవాడలా గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలతో ప్రత్యేకంగా అలంకరించారు. నక్కబొక్కలపాడు గ్రామ సమీపంలో ఈర్లకొండకు దిగువ భాగంలో వేంచేసివున్న ఈర్ల గంగమ్మ సన్నిధానానికి వివిధ గ్రామాలకు చెందిన భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయ సమీపంలో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నివేదించి తమతమ మొక్కులు తీర్చుకున్నారు. బల్లికురవ, కొత్తపాలెం, గుంటుపల్లి, పెద అంబడిపూడి, వైదన, కొణిదెన, చెన్నుపల్లి, కొండాయపాలెం, ముక్తేశ్వరం, నక్క బొక్కలపాడు గ్రామాల్లోని గ్రామ దేవతలైన పోలేరమ్మ, మహాలక్ష్మమ్మ ఆలయాల్లోని అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. పాడి పంటలతో తమ కుటుంబాలను చల్లగా చూడాలని అమ్మవార్లను ప్రార్థించారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కారంచేడు: గ్రామ దేవత గంగమ్మతల్లికి గ్రామస్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి మండల కేంద్రమైన కారంచేడు పుట్టాయిపాలెంలో కొలువైన గంగమ్మ తల్లికి గ్రామ ఆడపడుచులు పొంగళ్ళు సమర్పించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి నైవేద్యాలు, పొంగళ్ళు సమర్పించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరొందిన అమ్మవారిని దర్శించుకోవడానికి గ్రామ ఆడపడుచులతో పాటు, గ్రామస్తులు, చీరాల, పర్చూరు, ఇంకొల్లు మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు.


ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం ఉత్తరాయణం వైశాఖ మాసం పూర్వాషాఢ నక్షత్రం చవితి తిథి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చనఅనంతరంఆలయం మూసివేస్తారు.

నేడు విద్యుత్ అంతరాయం

చినగంజాం: మండలంలో చినగంజాం, కొత్తపాలెం, రాజుబంగారుపాలెంలో కరెంట్ నిలిపివేస్తున్నట్లు ఏఈ పి. గణనారాయణ తెలిపారు. చినగంజాంలో సాయిబాబా గుడి వద్ద ఉన్న భారీ విద్యుత్ స్తంభాన్ని మార్చివేస్తున్న సందర్భాన్ని పురస్కరించుకొని అటువైపుగా వెళుతున్న విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ ఉండదని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపటి నుంచి దంత వైద్య శిబిరం

చీరాల రూరల్: స్థానిక సాల్మన్ సెంటర్‌లోని ఆంధ్రా ఇవాలంజిలికల్ లూథరన్ చర్చి, బేర్ క్రిస్టియన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఈనెల 28 జూన్ 1 వరకు మెగా ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు బేర్ క్రిస్టియన్ హాస్పిటల్ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమెరికా దేశం నుంచి ప్రఖ్యాతి గాంచిన దంత వైద్య నిపుణులు డాక్టర్ జెర్రి రోష్, డాక్టర్ జెనెట్, డాక్టర్ శరణ్య ఎలిజబెత్‌లు ఈ శిబిరంలో పాల్గొని అత్యాధునిక వైద్య పరికరాలతో ఉచిత వైద్య సేవలు అందిస్తారని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వైద్య సేవలు అందజేస్తారని తెలిపారు. చీరాల, పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎటువంటి లాభాపేక్ష లేకుండా ప్రజలకు సేవ చేయాలనే సదుద్దేశంతోనే ప్రతి ఏడాది క్రమం తప్పకుండా మెగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి సేవలు కొనసాగిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పూర్తి వివరాలకు 9642463672, 9390186884, 7674978920 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

బల్లికురవ ఇన్‌చార్జి లైబ్రేరియన్‌గా సుగుణారావు

బల్లికురవ: బల్లికురవ శాఖ గ్రంథాలయ ఇన్‌చార్జి లైబ్రేరియన్‌గా చుండూరి సుగుణారావు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఏ. రమేష్‌బాబు ఈనెల 31తో ఉద్యోగ విరమణ చేయనున్నారు. అద్దంకి గ్రంథపాలకునిగా పనిచేస్తున్న సుగుణరావుకు జిల్లా గ్రంథాలయ సంస్థ అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రతి శనివారం బల్లికురవలో విధులు నిర్వహిస్తానని ఆ రోజు నవలలు, వివిధ రకాల పుస్తకాలు కావాల్సినవారంతాబుక్‌డిపాజిట్‌తోపొందవచ్చన్నారు.

పాల ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

అద్దంకి: రోడ్డుపై వెళుతున్న పాదచారిని ఆటో ఢీకొట్టిన ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన పట్టణంలోని అద్దంకి–నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిలోని రామనగర్ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. అందిన సమాచారం మేరకు.. మండలంలోని నాగులపాడు గ్రామానికి చెందిన జ్యోతి ఆకాశ్ పట్టణంలోని ఏఎస్ఎన్ కార్యాలయంలో పని చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రోడ్డుపై నడుస్తూ వెళుతుండగా పాల ఆటో అతడిని ఢీ కొట్టింది. దాంతో తీవ్రగాయాలపాలయ్యాడు. స్థానికుల సమాచారం మేరకు 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మసీదులో ప్రార్థనలు

- వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలంటూ..


మార్టూరు మసీదు ప్రార్థనల్లో మైనారిటీ సెల్ నాయకులు

మార్టూరు: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏపీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరోసారి అధికారంలోకి రావాలంటూ మార్టూరులో స్థానిక మైనారిటీ నాయకులు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పర్చూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా యడం బాలాజీ, ఎంపీగా నందిగం సురేష్‌లు అత్యధిక మెజారిటీతో గెలవాలని మత పెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు.

ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం మస్తాన్ వలి, మసీదు ముషావర్, అబ్దుల్ రెహమాన్ సాబ్, మీరావలి సాబ్, అరీఫుల్లా, ఫిరోజ్‌వలి, ముస్తఫా పాల్గొన్నారు.

ఆమంచి వ్యాఖ్యలపై ఖండన


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు

చీరాల రూరల్: దళిత సామాజిక వర్గానికి చెందిన డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌పై ఆమంచి కృష్ణమోహన్ చేసిన అహంకారపూరిత వ్యాఖ్యలను మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్), మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎమ్మెస్పీ) నాయకులు తీవ్రంగా ఖండించారు. ఆదివారం విజయనగర్ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బుడంగుంట్ల లక్ష్మి నరసయ్య, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుడ్డు వందనం మాట్లాడారు. ఉన్నత విద్యను అభ్యసించి తన విధులను చక్కగా నిర్వర్తిస్తున్న డీఎస్పీ బేతపూడి ప్రసాద్‌ను ఆమంచి వ్యక్తిగతంగా దూషించడం తగదని, దళితులన్నా, దళిత అధికారులన్నా ఆమంచికి గిట్టదనే విషయం దీనితో అర్థమైపోయిందన్నారు. ఇదేవిధమైన పద్ధతి కొనసాగితే భవిష్యత్తులో మందా కృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో తేళ్ల పవన్, డేగల నాగరాజు, దుడ్డు రవి, దుడ్డు మనోజ్, మేరీషా, అబ్రహం, విగ్నేష్, ప్రవీణ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా స్వామీజీ జన్మదిన వేడుకలు


దత్తపీఠం వద్ద జన్మదిన వేడుకల్లో ఆలయ కమిటీ సభ్యులు

అద్దంకి: పట్టణంలోని శ్రీదన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో ఆదివారం మైసూరు దత్త పీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ జన్మదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా దాత్తత్రేయ స్వామివారికి తైలాభిషేకం, విద్యాగణపతికి విశేష అర్చన, లోకకళ్యాణం కోసం స్వామీజీ సామాజిక ధార్మిక కార్యక్రమాలు చేస్తూ దత్త భక్తులను తరింపజేస్తున్నారని కమిటీ సభ్యులు అన్నారు. హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. అనంతరం భగవద్గీత పారాయణంలో స్వర్ణ పతకాలు పొందిన అద్దంకి దత్త భక్తులకు అమ్మవారి శేష వస్త్రాలతో ఆశీర్వదించారు. అధ్యక్షుడు నాగసూరి హనుమత్ ప్రసాద్, మామిడి రాంబాబు, తమ్మన శ్రీనివాసరావు, చామిర్థ వెంకట్రావు, ధర్మవరపు శ్రావణ్‌కుమార్, ఒబ్బినేడి సుబ్బారావు, ఉభయ దాతలుగా పూజ నిర్వహించారు.

పరిశీలించి మందులు ఇవ్వాలి


గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ నీరజ

ఇంకొల్లు (చినగంజాం): గ్రామీణ వైద్యులైన ఆర్ఎంపీలు వారి వద్దకు వచ్చే ప్రతి రోగిని సునిశిత పరిశీలన చేసి మందులు ఇవ్వాలని గుంటూరు వైద్యశాలకు చెందిన ప్రముఖ నరాల డాక్టర్ కె. నీరజ అన్నారు. గ్రామీణ వైద్యులకు న్యూరాలజీకి సంబంధించిన ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. అధిక బరువు, అధిక షుగర్, అధిక రక్తపోటు మొదలైనవి పక్షవాతానికి దారి తీస్తాయని, పక్షవాతం రోగులను గోల్డెన్ అవర్స్‌లో చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలియజేశారు. పక్షవాతం వ్యాధికి నాటు మందులు వాడి ప్రాణాల మీదకి తెచ్చుకోవద్దన్నారు. కోవిడ్ అనంతరం ప్రతి వ్యక్తి రోగాలకు గురవుతున్నారని అన్నారు. శిక్షణ అనంతరం గ్రామీణ వైద్యులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. రావినూతల శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సలోమి, విజయకుమార్, వేణుకుమారి, గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు


దాతలు, పాస్టర్ల చేతులు మీదుగా నగదు ప్రోత్సాహకాలు అందుకున్న విద్యార్థులు

చీరాల రూరల్: కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చునని రెవరెండ్స్ కొమ్మిన జోసఫ్ కేరి, పిల్లి దేవదానులు పేర్కొన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు దాత పేరాల ఏఆర్ఎం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు, సండే స్కూలు టీచర్ బేతాళ సాల్మన్ రాజు కుటుంబం సభ్యులు అందజేసిన నగదు ప్రోత్సాహకాలను ఆదివారం స్థానిక సెయింట్ మార్క్స్ సెంటినరీ లూథరన్ చర్చిలో అందించారు. చర్చి చైర్మన్ దేటా అశోక్ కుమార్ మాట్లాడారు. ప్రధానోపాధ్యాయులు సాల్మన్ రాజు ప్రథమ, ద్వితియ, తృతీయ స్థానాల్లో ఉత్తీర్ణత సాధించి బాల, బాలికలు నగదు ప్రోత్సాహకాలు అందించినట్లు చెప్పారు. బాలురలో అత్యధిక 530 మార్కులు సాధించిన కోండ్రు రిక్కీ ఫరద్‌కు రూ. 5,000, 485 మార్కులు సాధించిన వీరమాసు జోయల్ క్రిష్టఫర్‌కు రూ. 3,000, 473 మార్కులు సాధించిన జోగి గౌతమ్ కౌషిక్‌బాబుకు రూ. 2,000 అందించారు. బాలికల్లో 588 మార్కులు సాధించిన ముత్యాల కీర్తిప్రియకు రూ. 5,000 చొప్పున, 552 మార్కులు సాధించిన జ్యోతుల మహిమైశ్వర్యకు రూ. 3,000, 467 మార్కులు పొందిన జెజ్జం సంజనకు రూ. 2,000 అందజేశారు. ట్రెజరర్ పేర్లి ఆనంద్, పీసీసీ, ఎల్‌సీసీ, సండేస్కూలు టీచర్లు, సంఘస్థులు, దాత సాల్మన్‌రాజు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నీలం రాజుకు నివాళి


పూలమాలలు వేస్తున్న సృజన సాహిత్యవేత్తలు

అద్దంకి రూరల్: ప్రముఖ కవి నీలంరాజు నరసింహారావు కవితలు కర్షకులు చుట్టూ తిరుగుతూ వారి జీవన విధానాలను ప్రతిబింబిస్తుంటాయని, అందుకే ఆయనను కర్షక పక్షపాతి అంటారని సాహిత్యవేత్త అన్నమనేని వెంకట్రావు అన్నారు. ఆదివారం రాత్రి స్థానిక కమతేశ్వరస్వామి దేవస్థానంలో సృజన సాహిత్య సమావేశం నిర్వహించారు. నీలం రాజు నరసింహారావు రచనపై కవి గాడేపల్లి దివాకరదత్తు సంకలనం చేసిన గ్రంథం శతాధిక పత్ర కావ్యాన్ని అన్నమనేని వెంకట్రావు సమీక్షించారు. యు. దేవపాలన, నారాయణం బాలసుబ్రమణ్యం, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, అద్దంకి లెవీ ప్రసాద్, మలాది శ్రీనివాసరావు, వారణాసి రఘురామశర్మ, కొల్లా భువనేశ్వరీ, మన్నం త్రిమూర్తులు, ఆర్‌వీ రాఘవరావు, ఆకుల యోగేశ్వర్, సాహితీ మిత్రులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన తప్పనిసరి

మేదరమెట్ల: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ శాంతా కుమారి అన్నారు. కొరిశపాడు మండలంలోని రావినూతల గ్రామంలోని సాయి ప్రాంగణంలో టైమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. డాక్టర్ హృదయనాథ్, టైమ్స్ ట్రస్టీలు అపర్ణ, శ్రీరంజనీ, యడ్లపల్లి నరసింహారావు, అనుబ్రోలు ప్రభాకర్‌రావు, దామా శ్రీనివాసరావు, మోపర్తి శేషు, డాక్టర్లు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
చీరాల డివిజన్
90101 55593 (చీరాల)
Office mail : sakshiongads@gmail.com